సాక్షి
కామారెడ్డి

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

ప్రజావాణిలో నమోదయ్యే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 10లో ▸



బీజేపీతోనే రాజ్యాధికారం

బీజేపీతోనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
39.4 /22.3

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దామోదర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన పుల్లం దామోదర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన యూనియన్ రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి దామోదర్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కన్కల్ గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి పీఆర్‌టీయూలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పీఆర్టీయూ జిల్లా నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయనను కలిసి సన్మానించారు.

'కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



మద్నూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార సూచించారు. మండల కేంద్రంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీ సభ్యత్వం ఇవ్వాలన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం కాషాయమయం కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుకారాం, నాయకులు పండిత్‌రావ్ పటేల్, రామ్ పటేల్, బాలకిషన్, కృష్ణ పటేల్, యాదవ్‌రావ్, తుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: సెట్విన్ ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ కామారెడ్డి సెంటర్ సమన్వయకర్త సయ్యద్ మొయిజుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం ఫీజు రాయితీ ఉంటుందని, ఇతర వివరాలకు 73861 80456, 79891 59121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డీవీఎంసీకి..

కామారెడ్డి అర్బన్: జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ)లో ఐదుగురు నాన్ అఫీషియల్ మెంబర్ల ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జి.రజిత సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కనీసం డిగ్రీ చదివి, ఎలాంటి నేర చరిత్ర లేని వారు ఈనెల 11వ తేదీలోగా కలెక్టరేట్‌లోని 113 నంబర్ గదిలోగల ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు.

నేడు చేపపిల్లల విడుదల

బాన్సువాడ : బాన్సువాడ కల్కి చెరువులో మంగళవారం చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా ఫిషరీస్ అధికారి భీంకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్‌కు సంబంధించి జిల్లాలో మొట్టమొదట బాన్సువాడలో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొంటారని తెలిపారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం




బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉంది. 21,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అంతే స్థాయిలో నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 12 వేలు, సరస్వతి కాలువ ద్వారా 500, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,200, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల కాగా సోమవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండు కుండలా ఉందని అధికారులు తెలిపారు.

అమాత్యయోగం ఎవరికో?

రాష్ట్ర మంత్రి వర్గాన్ని విస్తరించే అవకాశాలు ఉండడంతో జిల్లాలో ఎవరికి అమాత్యయోగం దక్కుతుందన్న అంశంపై కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చలు నడుస్తున్నాయి. మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీకి అవకాశం ఉండొచ్చని పలువురు భావిస్తున్నారు. ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు కూడా ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు.

- మంత్రి పదవిపై కాంగ్రెస్ నాయకుల్లో చర్చ
- మైనారిటీ కోటాలో షబ్బీర్‌కు చాన్స్ అంటూ ప్రచారం
- గట్టి ప్రయత్నాలు చేస్తున్న మదన్‌మోహన్‌రావు
- అవకాశం ఇవ్వాలని కోరుతున్న లక్ష్మీకాంతారావు



ముగ్గురు నేతల ప్రయత్నాలు..

రాష్ట్ర మంత్రి మండలిని విస్తరించే క్రమంలో కామారెడ్డి జిల్లా నుంచి ఎవరికి అవకాశం దక్కుతుందన్న దానిపై జిల్లాలో చర్చ జోరందుకుంది. త్వరలో మంత్రి మండలిని విస్తరించే అవకాశాలు ఉన్నాయన్న సంకేతాలు వెలువడుతుండడంతో మంత్రి పదవి రేసులో ఉన్నవారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. తమకు పార్టీ పెద్దలతో ఉన్న పరిచయాలు, అనుబంధంతో ఎవరి స్థాయిలో వారు ప్రయత్నిస్తున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కూడా ఢిల్లీ స్థాయిలో తనకున్న పరిచయాలతో మంత్రి పదవి కోసం తన పేరును పరిశీలించాలని కోరినట్టు తెలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు గడిచిపోయాయి. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లో పలువురు నేతలు మంత్రి పదవులు ఆశించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలైనా.. మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీకి అవకాశం ఇస్తారని ఆయన అనుచరులు ఆశించారు. అయితే తొలి మంత్రివర్గ కూర్పులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించలేదు. ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పందేరం మొదలుపెట్టి, బాన్సువాడకు చెందిన కాసుల బాల్‌రాజును ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌ను చేసింది. భిక్కనూరుకు చెందిన మద్ది చంద్రకాంత్‌రెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించింది. మరికొందరికి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలలో చోటు కల్పించింది. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, ఎల్లారెడ్డికి చెందిన సుభాష్‌రెడ్డి రాష్ట్ర స్థాయి పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

సీనియర్ నేతకు అవకాశం దక్కేనా?

సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేయడంకోసం కామారెడ్డి టికెట్టును త్యాగం చేసి నిజామాబాద్ అర్బన్‌లో నిలబడి ఓటమి చెందిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి మంత్రి వర్గంలో స్థానం లభిస్తుందన్న ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా మైనారిటీలకు సముచిత స్థానం కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. గత ప్రభుత్వంలో మహమూద్ అలీకి డిప్యూటీ సీఎంగా అవకాశం ఇచ్చారు. అంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో షబ్బీర్‌అలీ ఐదేళ్ల పాటు కీలకమైన విద్యుత్ శాఖకు మంత్రిగా పనిచేశారు. రాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మైనారిటీలకు తగిన గుర్తింపు ఇస్తోంది. అందులో భాగంగా షబ్బీర్‌అలీని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖలకు ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. అయితే మంత్రివర్గంలో మైనారిటీలకు అవకాశం కల్పించాలని నిర్ణయిస్తే సీనియర్ నేత షబ్బీర్‌కు అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు.

రేసులో మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో ఉన్న సన్నిహిత సంబంధాలతో ఆయన మంత్రివర్గంలో చోటు కోసం సీరియస్‌గా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ ముఖ్య నేతలతో రెగ్యులర్‌గా టచ్‌లో ఉన్న మదన్‌మోహన్‌రావు అసెంబ్లీకి తొలి ఎన్నికైనా.. తనకు మంత్రివర్గంలో అవకాశం దక్కుతుందన్న నమ్మకంతో ఉన్నారు. మదన్‌మోహన్‌రావుకు మంత్రి పదవి పక్కా అంటూ ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారు. అయితే సామాజిక సమీకరణాల కూర్పులో భాగంగా ఒక వేళ అవకాశం దొరక్కపోతే కేబినెట్ హోదాతో చీఫ్ విప్ పదవి దక్కుతుందని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ దిగ్గజాలతో పరిచయాలు కలిగిఉన్న మదన్‌మోహన్‌రావు ఇటీవలి కాలంలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పలు సాఫ్ట్‌వేర్ సంస్థల సీఈవోలతో సమావేశాల్లో పాల్గొన్నారు. అమెరికా పర్యటనలో అటు రేవంత్‌రెడ్డితో, ఇటు రాహుల్‌గాంధీతో కూడా ఆయన పాల్గొన్నారు. మదన్‌మోహన్‌రావుకు మంత్రి పదవి వస్తుందన్న నమ్మకంతో ఆయన అనుచరులు ఉన్నారు.



ఏఎంసీ పాలకవర్గంతో ప్రమాణం చేయిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

పనిచేసే వారికే గుర్తింపు

- రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలి
- ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- గాంధారి ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

గాంధారి: అంకిత భావంతో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందని, పదవులు వాటంతటవే వస్తాయని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో సోమవారం గాంధారి ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్‌గా గండివేట్‌కు చెందిన బండారు పరమేశ్వర్, వైస్ చైర్మన్‌గా గాంధారికి చెందిన అకుల లక్ష్మణ్‌తో పాటు డైరెక్టర్లతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పాలక వర్గం రైతులకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో డబ్బులు తీసుకుని పదవులు ఇచ్చేవారని ఆరోపించారు. తాము మాత్రం నిజాయితీతో పార్టీ కోసం పనిచేసిన పేద కార్యకర్తలకే ఏఎంసీ పదవులు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపి వేశారన్నారు. తాము వారికి బిల్లులు చెల్లించి, పనులు ప్రారంభమయ్యేలా చూస్తున్నామన్నారు. ప్రాణహిత – చేవెళ్ల 22వ ప్యాకేజీ పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎంపీ సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు. పద్మాజీవాడి ఎక్స్ రోడ్డు నుంచి బాన్సువాడ వరకు రహదారిని నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్, వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

- సీఎం కార్యాలయ సీనియర్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీనియర్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయ సీనియర్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కామారెడ్డికి వచ్చిన ఆయనకు కలెక్టరేట్ వద్ద కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు మొక్కను అందించి, స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ధాన్యం సేకరణ, ఇతర సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఆర్‌డీవో సురేందర్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేందర్, మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి



సమావేశంలో పాల్గొన్న మిల్లర్లు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. రైస్ మిల్లర్లతో సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరలించిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దొడ్డు, సన్న రకం ధాన్యాన్ని వేరువేరుగా నిల్వ చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బకాయిలను త్వరితగతిన చెల్లించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పప్పుల రాజేందర్, కార్యదర్శి సంతోష్, మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

బంతి సాగు.. బహుబాగు



పెద్దఎడ్గిలో సాగవుతున్న బంతి

మద్నూర్(జుక్కల్): పంట చేనుని బంతిపూలతో అలంకరించినట్లు కనిపిస్తున్న ఈ దృశ్యం మద్నూర్ – జుక్కల్ ప్రధాన రహదారి వెంబడి కనువిందు చేస్తోంది. పెద్ద ఎడ్గి గ్రామ శివారులో రైతు అస్పత్‌వార్ రాములు అర ఎకరంలో బంతి సాగు చేస్తున్నాడు. శరన్నవరాత్రులు, దసరా, దీపావళి నేపథ్యంలో బంతి పూలకు మంచి డిమాండ్ ఉంటుందని రాములు తెలిపాడు.

క్రమబద్ధీకరణపై అనాసక్తి

- ముందుకురాని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు
- 30 శాతం దరఖాస్తులకు మాత్రమే పరిష్కారం
- పట్టించుకోని అధికారులు



జిల్లా కేంద్రంలో లేఅవుట్ లేని వెంచర్

కామారెడ్డి టౌన్ : అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్‌ఆర్‌ఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపినా.. దరఖాస్తుదారులు మాత్రం క్రమబద్ధీకరణకు ఆసక్తి చూపడం లేదు. అధికార యంత్రాంగం దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చి క్రమబద్ధీకరించుకోవాలని సూచించినా ఎవరూ ముందుకు రావడం లేదు. ప్లాట్ల యజమానులు పట్టించుకోకపోవడం, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ లేఅవుట్లు అక్రమంగానే ఉండిపోతున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి

రాష్ట్ర ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చింది. దీంతో క్రమబద్ధీకరణకోసం కామారెడ్డి బల్దియా పరిధిలో 17,581, బాన్సువాడలో 1,908, ఎల్లారెడ్డిలో 1,102 దరఖాస్తులు వచ్చాయి. అప్పట్లో సర్కారు వాటిని పెండింగ్‌లో పెట్టింది. ఇటీవలే ఎల్‌ఆర్‌ఎస్‌కు సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తుదారులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో ఇప్పటివరకు కామారెడ్డి మున్సిపాలిటీలో 5,793, బాన్సువాడలో 496, ఎల్లారెడ్డిలో 231 దరఖాస్తులు మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. ఈ దరఖాస్తులలోనూ కొన్ని షార్ట్‌ఫాల్స్, కొన్ని తిరస్కరణకు గురయ్యాయి. ఇంకొన్ని ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టారు. మరికొన్నింటిని యజమానులు అమ్ముకోవడంతో పేరు మార్పిడి అయ్యాయి.

పేరు మార్పు ప్లాట్లకు అవకాశం

2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకుని ఆ తర్వాత అమ్ముకున్న ప్లాట్లు మున్సిపాలిటీలలో 30 శాతానికిపైగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంటే ఎల్‌ఆర్‌ఎస్ లేని ఆ ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకోకుండానే క్రయవిక్రయాలు జరిగాయి. ఆయా ప్లాట్లను కొనుక్కున్నవారు ఎల్‌ఆర్‌ఎస్ కోసం బల్దియాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పాత యజమాని పేరుపై ఉండడంతో ఆన్‌లైన్‌లో క్రమబద్ధీకరణకు అవకాశం లేక ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం మున్సిపల్ శాఖ ఇలాంటి వారి కోసం ఆప్షన్‌కు సవరించింది. పేరు మారిన ప్లాట్ల యజమానులకు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

ఆశలు గల్లంతు

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అనధికారిక లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించడం ద్వారా రుసుముల రూపేణ కోట్లాది రూపాయల నిధులు సమకూరుతాయని సర్కారు ఆశించింది. అయితే దరఖాస్తుదారుల నుంచి స్పందన రాకపోవడంతో ఆశించిన ఆదాయం సమకూరడం లేదు. అధికారులు సైతం క్షేత్ర స్థాయిలో పట్టించుకోకపోవడంతో దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, యజమానులకు నోటీసులు ఇచ్చి ప్లాట్లను క్రమబద్ధీకరించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ప్రతి దరఖాస్తుదారు స్పందించాలి

ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు స్పందించాలి. భారీగా రుసుం అవుతుందనే అపోహ వీడాలి. ప్రస్తుత మార్కెట్ ధర కాకుండా డాక్యుమెంట్‌లో ఉన్న ధర ప్రకారమే రుసుం వసూలు చేస్తాం. పేరు మార్పు జరిగిన ప్లాట్లకు క్రమబద్ధీకరణకు ఆప్షన్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ లేకుంటే ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వం. అనుమతి లేకుండా నిర్మించే భవనాలకు నోటీసులు ఇచ్చి కూల్చివేస్తాం.

– గిరిధర్, టీపీవో, కామారెడ్డి

జల సహాయకులొస్తున్నారు

- ఉమ్మడి జిల్లాలో 1,300 మంది వాటర్‌మన్‌ల ఎంపిక
- మిషన్ భగీరథ ఆధ్వర్యంలో శిక్షణ
- పైపులైన్ లీకేజీ, మోటార్ల మరమ్మతులు, క్లోరినేషన్‌పై అవగాహన

బాన్సువాడ: మిషన్ భగీరథ నీటి సరఫరాలో అక్కడక్కడ ఎదురవుతున్న సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ 'నల్ జల్ మిత్ర' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి పూర్తి చేసిన 18 నుంచి 45 ఏళ్లలోపు వారిని వాటర్‌మన్‌లుగా ఎంపిక చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 1,300 మంది ఎంపికయ్యారు. వీరికి మిషన్ భగీరథ ద్వారా మూడు విడతల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే మొదటి దఫా శిక్షణ పూర్తయ్యింది. మొదటి విడతలో జిల్లాకు సంబంధించి బాన్సువాడ అర్బన్, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాలకు కలిపి రైతునగర్‌లో నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మంచినీటి సహాయకులకు సర్టిఫికెట్లు అందించారు. ఈనెల 24వ తేదీలోగా మిగతా మండలాల సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నారు. చిన్న పంచాయతీల్లో ఒకరు, మేజర్ పంచాయతీల్లో ఇద్దరు లేదా ముగ్గురు గ్రామ మంచినీటి సహాయకులను ఎంపిక చేశారు.



రైతునగర్‌లో వాటర్‌మెన్‌కు శిక్షణ ఇస్తున్న మిషన్ భగీరథ ఎస్‌ఈ రాజేందర్ (ఫైల్)

అవగాహన వచ్చింది



నిన్నటి వరకు ఊళ్లో నీళ్ల వదలడంలో ఏమైనా సమస్య వస్తే నాకు తెలిసినట్లు రిపేరు చేసేవాడిని, ఇక్కడ నాలుగు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ వల్ల అనేక విషయాలు తెలిశాయి. మోటార్ల మరమ్మతు నుంచి పైపులైను లీకేజీ వరకు అన్నింటిపై అవగాహన వచ్చింది.

– దేవిసింగ్, మంచినీటి సహాయకుడు, మైలారం

మేమే బాగు చేస్తాం



నాలుగు రోజులపాటు ఇచ్చిన శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. గ్రామాల్లో సమస్య లేకుండా నీటిని ఎలా సరఫరా చేయాలో తెలిసింది. మోటార్లు రిపేర్‌కు వస్తే పట్టణానికి తీసుకెళ్లి చేయించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేదు. మేమే బాగుచేసి నీటిని సరఫరా చేస్తాం.

– హుస్సేన్, మంచినీటి సహాయకుడు, మైలారం

శిక్షణ ఇస్తున్నాం

మంచినీటి సరఫరాలో తలెత్తే చిన్నపాటి సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించడంపై వాటర్‌మన్‌లకు అవగాహన కల్పిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో 1,300 మందిని ఎంపిక చేసి, శిక్షణ ఇస్తున్నాం. మొదటి విడతలో బాన్సువాడ అర్బన్, రైతునగర్, వర్ని, నిజామాబాద్‌లలో శిక్షణ పూర్తయ్యింది. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చాం. త్వరలో మిగతా వారికి శిక్షణ పూర్తి చేస్తాం.

– రాజేందర్, ఉమ్మడి జిల్లా మిషన్ భగీరథ ఎస్‌ఈ

పూర్తిస్థాయి శిక్షణ

మంచినీటి సహాయకులకు సింగిల్‌ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లు చెడిపోతే మరమ్మతులు చేసేలా శిక్షణ ఇచ్చారు. పైపులైన్ లీకేజీ మరమ్మతులు, కొత్త పైపులైను ఏర్పాటు చేయడంపై అవగాహన కల్పించారు. నీటి ట్యాంకులు శుభ్రం చేయడం, క్లోరినేషన్ సక్రమంగా ఉండేలా చూసుకోవడంపై వివరించారు. పైపులైన్ చివరలో ఉన్న ఇంటికి సైతం శుద్ధమైననీటిని అందించేలా నైపుణ్యం కల్పించారు. శిక్షణ పొందిన వారు గ్రామాల్లో చేసే పనులకు గాను పంచాయతీ నిధులలోంచి చెల్లించనున్నారు.

క్లుప్తంగా

బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు



బాన్సువాడ రూరల్(బాన్సువాడ): బతుకమ్మల నిమజ్జనానికి మండలంలోని ఇబ్రహీంపేట్ చెరువు కట్టపైన సోమవారం ట్రాక్టర్ బ్లేడ్‌తో గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే విద్యుత్ దీపాలను అమర్చుతున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్ తెలిపారు. పండుగల నేపథ్యంలో గ్రామంలోని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతు గ్రామస్తులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ డీఈ విజయసారథికి వినతి పత్రం అందించారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై అధికంగా లోడ్ పడటంతో తరుచూ ఫ్యూజులు పోయి విద్యుత్ సమస్య ఏర్పడుతోందన్నారు. దీంతో పాటు పలు కాలనీలలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని.. సరి చేయాలని కోరారు.

వృత్తి విద్య కోర్సులపై అవగాహన



బాన్సువాడ: వృత్తి విద్య కోర్సులపై సోమవారం కొత్తాబాది మోడల్ స్కూల్ విద్యార్థులకు బాన్సువాడ ఆస్పత్రిలో అవగాహన కల్పించారు. హెల్త్‌కేర్ విభాగంలోని ఫార్మసీ, పిల్లల ఓపీ, ఇంజక్షన్ ఓపీ, లేబర్ వార్డు, ప్రథమ చికిత్స, వ్యాక్సినేషన్, బీపీ పరీక్ష, రక్త నమునాల సేకరణ, తదితర అంశాల గురించి విద్యార్థులకు శిక్షకురాలు సుజాత వివరించి చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమం పది రోజుల పాటు కొనసాగుతుందని, ఈ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆమె అన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 82 వినతులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 82 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వినతులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్‌రావు, ఏవో మస్రూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజంపేటలో...

రాజంపేట: ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరైనట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. ప్రజావాణిలో భాగంగా రాజంపేట మండలంలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన పేర్కొన్నారు.



రాజంపేట: ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయాలి



తమ గ్రామాన్ని ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయాలని కోరుతూ రామారెడ్డి మండలం గోకుల్ తండా –2 ప్రజలు ప్రజావాణికి తరలి వచ్చారు. వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం గోకుల్ తండా గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న గోకుల్ తండా–2 గ్రామంలో 737 జనాభా, 478 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని జీపీగా ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

బీజేపీ నేతల వినతి పత్రాలు

భిక్కనూరు: కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలలో ప్రజలు వేసిన ఫిర్యాదులను, సమస్యలను వెంటనే పరిష్కరించాలని భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వినతి పత్రాలను అందజేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, నేతలు, రమేష్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

జాతీయ రహదారి పనుల్లో అన్యాయం

హైదరాబాద్ నుంచి బాన్సువాడ మీదుగా బాసర వరకు నిర్మించతలపెట్టిన జాతీయ రహదారి పనుల్లో తమకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆరోపిస్తూ పలువురు రైతులు ప్రజావాణికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇదివరకే ఉన్న రోడ్డు వెంబడి కాకుండా కొద్ది దూరంలో 100 ఫీట్ల మేర భూములు సేకరించి కొత్తగా రోడ్డు వేస్తున్నారని తెలిపారు. దీంతో బాన్సువాడ, సోమేశ్వర్, దేశాయిపేట్, దుర్కి గ్రామాలకు చెందిన 20–30 ఎకరాల వరకు విలువైన భూములు పోతున్నాయని వాపోయారు. రైతులతో చర్చించి పరిహారం ఏమిటో స్పష్టం చేశాక పనులు చేపట్టాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.



రుణమాఫీకి కట్టుబడి ఉంది

వేల్పూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కొందరి రైతుల అకౌంట్ల వివరాలు సరిగా లేకపోవడంతోనే రుణమాఫీ కాలేదని వారి కోసం కేటాయించిన నిధులు బ్యాంకుల్లో అలాగే ఉన్నాయన్నారు. కొత్తగా ఏర్పడిన మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అధిక దిగుబడి, ఆదాయాన్నిచ్చే వంగడాలను కొద్దికొద్దిగా సాగుచేస్తూ విస్తీర్ణం పెంచాలన్నారు. డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్ అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ప్రసంగించారు. అనంతరం నూతన ఏఎంసీ పాలకవర్గ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు గడుగు గంగాధర్, నాయకులు అరికెల నర్సారెడ్డి, నగేశ్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, మారచంద్రమోహన్, వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆందోళన వద్దు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై రైతులు ఏ మాత్రం ఆందోళన చెందవద్దని నాగిరెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు సూచించారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. కొంత మంది బీఆర్ఎస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ రైతుల కోసం మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం తాము అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని, ధాన్యంలో తేమశాతం తగ్గిన వెంటనే సేకరించేలా తాము ప్రణాళికలు రూపొందించుకున్నామని చెప్పారు. నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామని తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల క్రమశిక్షణ సంఘం సభ్యులు రాంచందర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ నాయకులు

‘ఉపాధిహామీ’లో అక్రమాలు



సామాజిక ప్రజావేదికలో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో వామన్‌రావు

- బినామీలతో ఉపాధి పనులు
- సామాజిక తనిఖీలో బహిర్గతం
- సౌకర్యాలు లేక హడావిడిగా ముగించిన ప్రజావేదిక

కామారెడ్డి రూరల్: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడైంది. ఉపాధిహామీ పనుల్లో బినామీల రాజ్యం నడుస్తోంది. జిల్లా కేంద్రమైన కామారెడ్డి మండలంలో సోమవారం నిర్వహించిన 15వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో బినామీల పర్వం తేట తెల్లమైంది. ఉపాధి హామీ చట్టం ప్రారంభమై 19 ఏళ్లు కావస్తున్నా గ్రామ, మండల, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో ఇంకా లోపాలు బహిర్గతమవుతున్నాయి. సోమవారం నిర్వహించిన ప్రజావేదిక సభలో గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో పనులు చేయకుండానే కూలీల పేరుపై డబ్బులు వేసి డ్రా చేసినట్లుగా తేలింది. మస్టర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం, కొలతల్లో తేడాలు ఉండడం, మొక్కల పెంపకంలో జరిగిన అక్రమాలు వెల్లడయ్యాయి. అరకొర వసతులు ఏర్పాటు చేసి సామాజిక తనిఖీ ప్రజావేదికను తొందరగా ముగించారు. ప్రజావేదికకు ఉపాధి హామీ కూలీలు, ఆయా గ్రామాల ప్రజలు హాజరు కావాల్సి ఉండగా ఏ ఒక్కరూ హాజరుకాకపోవడం విశేషం. ఈ సందర్భంగా ఏపీడీ వామన్ రావు మాట్లాడుతూ...తనిఖీల్లో బయటపడిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పలువురిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ప్రశాంత్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రాఘవన్, అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, ఎస్ఆర్‌పీ మహేశ్వర్, ఎంపీడీవో నాగవర్ధన్, ఏపీవో నరేందర్, బీఆర్‌పీలు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో అధిక లాభాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): చేప పిల్లలను పెంచుకోవడంతో అధిక లాభాలు పొందవచ్చని లీడ్ మేనేజరు రవికాంత్ అన్నారు. తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో సోమవారం చేప పిల్లల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చేప పిల్లలను పెంచినట్లయితే సంవత్సరానికి రూ.2లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. బ్యాంకు ఖాతాలు, పట్టాపాస్ పుస్తకాలు ఉన్న వారికి సబ్సిడీపై బ్యాంకులలో లోన్ ఇప్పిస్తామన్నారు. ఆసక్తిగల వారు ఐకేపీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ట్రైనర్ ఉదయ్ పాల్గొన్నారు.

మాచారెడ్డి ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం



మాచారెడ్డి: మాచారెడ్డి గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం మండల అధ్యక్షుడు బట్ట రమేష్ ,రాష్ట్ర నాయకుడు వెంకట రాములు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్పుగొండ విజయ్, ఉపాధ్యక్షుడిగా పొదర్ల సురేష్, ప్రధాన కార్యదర్శిగా మామిడి రావు, కోశాధికారిగా మామిడి లింగం, గౌరవ అధ్యక్షుడిగా మామిడి లక్ష్మణ్ తదితరులను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మామిడి హరీష్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పొదర్ల రవి, సురేష్, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి యోగా ఓవరాల్ చాంపియన్‌గా నిజామాబాద్ జిల్లా



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉత్తమ విన్యాసలతో ఆకట్టుకొని ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను జిల్లా జట్టు కైవసం చేసుకుంది. సెప్టెంబర్ 28, 29వ తేదిల్లో పటాన్‌చెరువులో సబ్‌జూనియర్, జూనియర్ బాలబాలికల పోటీలు, సీనియర్ మెన్, ఉమెన్ ఏ, బీ, సీ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. అతి పురాతనమైన యోగాను ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాల్లో అభ్యసిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారన్నారు. యోగాను ఒక క్రీడగా గుర్తించి స్పోర్ట్స్ కోట ఇవ్వడం శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యోగా రాంచంద్రం, కార్యదర్శి టి బాల శేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శి జి సంగీత, సీనియర్ యోగాచార్యులు ఎ ప్రభాకర్, ట్రెజరర్ భూమా, సభ్యులు టి జ్యోతి, ఎం రఘువీర్ పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో బైక్ చోరీ

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని ఓ దుకాణం ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై మహేందర్ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని జై భవాని ట్రేడర్స్ ఫర్టిలైజర్ దుకాణం ఎదుట నాగరాజు అనే వ్యక్తి ఆదివారం బైక్‌ను పార్క్ చేసి వెళ్లాడు. బైక్ కనిపించక పోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో ఇద్దరికి జైలు

ఆర్మూర్‌టౌన్: ఆలయ గుడి గంటలు చోరీ చేసిన కేసులో షేక్ బాబు, షేక్ హైదర్‌కు ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి ఒక ఏడాది సాధారణ జైలుతో పాటు రూ.వేయి జరిమానా విధించినట్లు ఏర్గట్ల ఎస్సై బాపుల రాము సోమవారం తెలిపారు. వివరాలిఆలా ఉన్నాయి. మల్లాపూర్ మండలం హుస్సేన్‌నగర్‌కు చెందిన షేక్ బాబు, షేక్ హైదర్ 2023 డిసెంబర్19న ఏర్గట్ల శివారులోని శివాలయం తాళాలు ధ్వంసం చేసి గుడి గంటలు చోరీ చేశారు. గ్రామానికి చెందిన కొలిప్యాక శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై జక్కుల మచ్చేందర్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సోమవారం సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి నిందితులను ఏడాది జైలు శిక్షతో పాటు రూ. వేయి జరిమానా విధించారు. కాగా షేక్ హైదర్ మరో నేరంలో ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నాడు.

చెట్లు నరికినందుకు జరిమానా



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో చెట్లు నరికిన ముగ్గురు రైతులకు జరిమానా విధించినట్లు పంచాయతీ కార్యదర్శి నరేశ్ సోమవారం తెలిపారు. గ్రామంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లు అయ్యాయి. గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు తమ పొలాల్లో పంటలకు నీడ వస్తోందని చెట్లను నరికివేశారు. దీంతో ముగ్గురికి చెట్టుకు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఎవరైనా హరితహారం మొక్కలు, చెట్లను నరికితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్టయ్యఫారంలో చోరీ

నవీపేట: మండలంలోని మట్టయ్య ఫారం గ్రామానికి చెందిన కేతావత్ అర్జున్ ఇంట్లో దుండగులు చొరబడి బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి అర్జున్ తన భార్య లత, పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రపోయాడు. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఎలాంటి చప్పుడు కాకుండా లత మెడలో ఉన్న అరతులం బంగారు పుస్తెలతాడు, రెండు సెల్ ఫోన్‌లను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ సమస్యలతో ఒకరి ఆత్మహత్య

బీబీనగర్: కుటుంబ సమస్యలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై రమేష్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద గ్రామానికి చెందిన జిరిగె సునీల్‌కుమార్(34) బీబీనగర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో అద్దెకు ఉంటూ స్థానిక మాజీ ఎంపీటీసీకి చెందిన ఫాంహౌస్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో సునీల్‌కుమార్ కొంత కాలంగా మానసిక ఒత్తిడికి లోనై ఆదివారం రాత్రి అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



షేక్ లాయక్ (ఫైల్)

బోధన్‌టౌన్: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బోధన్ పట్టణంలోని బీటీనగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బీటీ నగర్ కాలనీకి చెందిన షేక్ లాయక్(24) అలియాస్ లల్లూ అనే యువకుడు బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు అతని స్నేహితులు అర్బాజ్, షేక్ మారూఫ్, జునేద్‌తో కలిసి ఆటోలో పట్టణ శివారులోని రాయ్‌కూర్ రోడ్డు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ లాయక్ తీవ్రంగా గాయపడడంతో ఆటోలో తీసుకెళ్లిన మిత్రులు అతడిని రవిగార్డెన్ ప్రాంతంలో ఉంచి మరో మిత్రుడు పవన్‌కు ఫోన్ చేసి ఇక్కడ లాయక్ స్పృహ తప్పి పడిపోయాడని సమాచారం అందించి పరారయ్యారు. వెంటనే పవన్ తన మిత్రులతో కలిసి రవి గార్డెన్ ప్రాంతంలో ఉన్న ఆటోలో లాయక్ తీవ్ర రక్తపు మరకలతో ఉన్నట్లు గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు లాయక్ మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు. పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, మృతుడి తండ్రి అబ్దుల్లా ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడు తన మిత్రులతో కలిసి రాయ్‌కుమార్ రోడ్డులో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ఇనుప రాడ్‌ల చోరీకి వెళ్లగా అక్కడ గొడవపడి లయక్‌ను హత్య చేశారా.. లేదా రాడ్‌లు చోరీ చేసి ఆటోలో వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత..

సదాశివనగర్: ఇంట్లో జరిగిన గొడవలకు ఆత్మహత్యకు పాల్పడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలం భూంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. భూంపల్లికి చెందిన మొగ్గం జ్యోతి(30) అదే గ్రామానికి చెందిన నవీన్ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలంటు జ్యోతిని నవీన్ వేధిస్తున్నాడు. దీంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల జ్యోతి భర్తకు చెప్పకుండా పుట్టింటికి వెళ్లింది. తనకు చెప్పకుండా ఎందుకు వెళ్లావంటు భర్త గొడవకు దిగడంతో మనస్తాపంతో ఈ నెల 5న ఇంట్లో ఉన్న గడ్డి మందును సేవించింది. అపస్మారక స్థితిలో ఉన్న జ్యోతిని గుర్తించిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఉన్నత వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరి మీన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సాగర్ పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్‌లో దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గంప రాజేందర్ కుటుంబీకులు ఈ నెల 2న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోనే కొనసాగుతున్న కిరాణ దుకాణంలో రూ. 22,300 నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా విచారణలో ముత్యంపేట గ్రామానికి చెందిన గరుగుల భరత్, కొండయ్యల రాజవ్వ అలియాస్ రజిత చోరీకి పాల్పడినట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్సై ఆంజనేయులు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఎడపల్లి: మండలంలోని ఠాణాకలాన్ శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సోమవారం ఠాణాకలాన్ శివారులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659873, 8712659780 నంబర్లను సంప్రదించాలని ఎస్సై వంశీధర్‌రెడ్డి కోరారు.

వాహనాల తనిఖీలు.. తగ్గిన రోడ్డు ప్రమాదాలు

ఖలీల్‌వాడి: వాహనాల తనిఖీలతో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో 625 ప్రమాదాలు జరిగితే ఇందులో 257 మంది మృతి చెందినట్లు తెలిపారు. జనవరి నుంచి మే నెల వరకు 173 మంది మరణిస్తే, జూన్ నెలలో సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నంబర్ ప్లేట్స్, నంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనాలు, ట్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా ప్రయాణించడం, మైనర్ డ్రైవింగ్ లాంటి వాటి మీద టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్, పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాంలు తగ్గాయని పేర్కొన్నారు. విస్తృత తనిఖీలతో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 84 మంది మృతి చెందినట్లు తెలిపారు. 2022 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 44 శాతం, 2023లో 40 శాతం మంది మృతి చెందితే, 2024లో 39 శాతం మంది మరణించినట్లు పేర్కొన్నారు. ట్రాన్స్ పోర్ట్, పోలీస్ డిపార్ట్‌మెంట్ కలిసి జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 2800కు పైగా కేసులు, రూల్స్‌ను అతిక్రమించిన వారిపై జరిమానాలు విధించినట్లు తెలిపారు. గత నెల సెప్టెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో 13 మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రాణాపాయం ఉండదని వెల్లడించారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి

మాచారెడ్డి: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్‌పై ఓ వ్యక్తి దాడిచేసిన ఘటన పాల్వంచ మండలం ఇసాయిపేట్‌లో చోటు చేసుకుంది. ఇసాయిపేట్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ పెనుబల్లి కొండారెడ్డి ఆదివారం రాత్రి సింగిల్ ఫేజ్ నుంచి త్రీఫేజ్‌లోకి కరెంటు చేంజ్ చేస్తుండగా ఇసాయిపేట్ గ్రామానికి చెందిన కురుమ సంతోష్ సబ్‌స్టేషన్‌లోకి వచ్చి కరెంటు ఎందుకు పోయిందంటు బూతులు తిడుతూ దాడి చేశాడు. ఆపరేటర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.